క్లుప్తంగా

శివాలయ పునర్నిర్మాణానికి రూ.2.30 లక్షల విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న బోకం సత్యనారాయణ

సబ్బవరం: స్థానిక శివాలయ పునర్నిర్మాణానికి సబ్బవరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బోకం సత్యానారాయణ రూ.2.30 లక్షల విరాళాన్ని సోమవారం అందించారు. ఆలయంలోని ఫ్లోరింగ్ ఏర్పాటుకు విరాళం అందించినట్లు తెలిపారు. ఈ మేరకు నగదు మొత్తాన్ని నిర్మాణంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులకు స్వయంగా అందించారు. కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొల్లి కృష్ణ, గెద్దం కృష్ణ, చింతల శ్రీను, దంగేటి ప్రకాష్, దంగేటి నాని, కరణం శ్రీను, గెద్దం ఈశ్వరరావు, కోన సోమేశ్వరరావు, బర్ల రమణ తదితరులు ఉన్నారు.

ఆలోచనాత్మకంగా జన్‌జిల్-2024



బహుమతులు అందుకున్న విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జన్ జిల్-2024 కార్యక్రమం ఆద్యంతం ఆలోచనాత్మకంగా సాగింది. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు సోలో సింగింగ్, జానపద గీతాలు, స్కిట్‌లలో చక్కటి ప్రతిభ కనబరిచారు. వాలీబాల్, డ్రాయింగ్ తదితర పోటీల్లో విద్యార్థులు పోటీ పడ్డారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఫ్లోరా చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


థాంగ్ టా పోటీల్లో ప్రతిభ



థాంగ్ టా ఫైటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

పరవాడ: రాష్ట్ర థాంగ్ టా ఫెడరేషన్ ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో జరిగిన పోటీల్లో ఎన్టీపీసీ దీపాంజలి నగర్ బాలభారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.వాసంతిదేవి సోమవారం మీడియాకు తెలిపారు. పోటీలో డి.ధనహర్షిణి, కె.సాయిరాగిణి, అశ్విన్ అనీష్ స్వర్ణ పతకాలు, సమీక్ష సాహు, జె.రిషిక, చేతస్ సాయి రజత పతకాలు, సాయి నారాయణ కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. విజేతలకు స్కూల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పీటీ షెల్టన్ జేమ్స్‌లతో కలిసి సిబ్బంది అభినందించారు.

బాక్సింగ్‌లో డిగ్రీ కళాశాల విద్యార్థి సత్తా




యశ్వంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి, తదితరులు


సబ్బవరం: ఇండియన్ బాక్సింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన విశాఖ ప్రొఫెషనల్ బాక్సింగ్ లీగ్‌లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి కండిపల్లి యశ్వంత్ బంగారు పతకాన్ని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సోమవారం తెలిపారు. కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ ఫస్టియర్ చదువుతున్న యశ్వంత్ ఈ నెల 8న 54 కిలోల విభాగంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని, ఈ పతకాన్ని సాధించాడని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బందితో కలిసి, అభినందించారు. బాక్సింగ్‌లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, ఎంవీ రామకృష్ణ, కంప్యూటర్ అధ్యాపకులు గణేష్, కళాశాల జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ లెక్కల గణేష్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో వ్యవసాయ రంగానికి మూలాధారం చెరువులు, పంటకాలువలు. వీటి అభివృద్ధిలో సాగునీటి సంఘాలే కీలకం. పంచాయతీ పాలకవర్గం తర్వాత గ్రామాల్లో ఆ స్థాయి ప్రాధాన్యత వీటిదే. సాధారణంగా సాగునీటి సంఘాల ఎన్నికల్లో రాజకీయ ప్రభావం నామమాత్రం. కూటమి ప్రభుత్వంలో వీటికీ రాజకీయ రంగు పులిమారు. పెందుర్తి పరిధిలో టీడీపీ, జనసేన అనుకూలురు మాత్రమే సంఘాల్లో ప్రాతినిధ్యం దక్కించుకునేలా పావులు కదుపుతున్నారు. ఈ నెల 14న జరిగే ఈ ఎన్నికల్లో ఎంత రగడకైనా సిద్ధమవుతున్నారు.

నీటి సంఘాలకు రాజకీయ బురద



గొరపల్లిలోని బసవనాయుడు చెరువు



పెందుర్తి: నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికలు రాజకీయ బురదను పులుముకుంటున్నాయి. నిజమైన రైతుల్ని పక్కన పెట్టి టీడీపీ, జనసేన పార్టీల్లో గ్రామస్థాయి రాజకీయ నిరుద్యోగులకు ప్రాధాన్యతనిచ్చేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. ఇప్పటికే 'మా వాళ్లు పదవుల్లో ఉంటేనే చెరువుల అభివృద్ధికి డబ్బులు ఇస్తాం'అని నాయకులు రైతులకు బాహాటంగానే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దానికి కొనసాగింపుగా ఇటీవల ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సైతం కూటమి నాయకులను ప్రత్యేకంగా సమావేశపరిచి నీటి సంఘాలను 'ఎలాగైనా'దక్కించుకోవాలని కేడర్‌కు నూరిపోశారు. మొత్తానికి పచ్చని పొలాల అభివృద్ధి కోసం ప్రశాంత వాతావరణంలో జరగాల్సిన ఎన్నికలను 'రాజకీయ ఎన్నికల'మాదిరిగా మార్చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్న విమర్శలు గ్రామాల్లో వెల్లువెత్తుతున్నాయి.

ఎన్నికల నిర్వహణకు కసరత్తు

పలుమార్లు వాయిదాలు పడుతూ వస్తున్న సాగునీటి సంఘాల ఎన్నికలు ఎట్టకేలకు ఈ నెల 14న నిర్వహించేందుకు యంత్రాగం సిద్ధమవుతోంది. నియోజకవర్గంలో మొత్తం 38(పెందుర్తి 13, సబ్బవరం 23, పరవాడ 2) సాగునీటి సంఘాలను రైతులు ఎన్నుకుంటారు. అధ్యక్షుడు సహా ఆరుగురు డైరెక్టర్లు ఉంటారు. ముందుగా ఒక్కో చెరువు ఆయకట్టును ఆరు సెగ్మెంట్లుగా విభజించారు. ఒక్కో సెగ్మెంట్ పరిధిలో ఒక్కో సభ్యుడి కోసం ఎన్నిక నిర్వహిస్తారు. గెలిచిన ఆరుగురిలో ఒకరిని అధ్యక్షుడిగా వారే ఎన్నుకుంటారు. ఓటు వేసేందుకు వచ్చే రైతులు తప్పనిసరిగా పాస్‌బుక్ లేదా 1–బి తీసుకుని రావాలి. ఈ ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల కానుంది.



పెంటవాని చెరువు

ఆయకట్టుపై ఆధిపత్యానికి కుయుక్తులు

ఇప్పటికే గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల వేడి రాజుకుంది. సాగునీటి చెరువుల నిర్వహణ, పంట కాల్వల మరమ్మతులు, చేపల పెంపకం, చెరువు గట్లపై మొక్కల ఫలసాయం తదితరాల్లో సాగునీటి సంఘాలే కీలకం. కూటమి పెద్దల ఆదేశాలతో గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు సంఘాలను తమ ఆధీనంలో ఉండేలా చూసుకునేందుకు కుయుక్తులు ప్రారంభించారు. ఎన్నికల్లో డైరెక్టర్లుగా నిలబడేందుకు ఆసక్తి చూపుతున్న సాధారణ రైతులను వద్దని తమ పార్టీలకు అనుకూలంగా ఉండే రైతులను బరిలోకి దించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వంలో పదవుల కోసం పట్టుబడుతున్న వారిని ఈ విధంగానైనా బుజ్జగించాలన్నది కూటమి పెద్దల ఆలోచన. దీంతో నయానో భయానో సాధారణ రైతులను బరిలో లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



పినగాడిలో 150 ఎకరాల ఆయకట్టున్న రాచ్చెరువు

రైతులకు మేలు జరగాలి



వ్యవసాయ రంగానికి మేలు జరగాలన్న సంకల్పంతో సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసుకుంటాం. మాలాంటి రైతుల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, చెరువుల్ని అభివృద్ధి చేసుకుంటాం. ఈసారి ఎన్నికల్లో ఎవరు గెలిచినా రైతులకు మేలు జరిగేలా చెరువులను, పంటకాలువలను అభివృద్ధి చేస్తే చాలు.

– గొరపల్లి శేషు, గొరపల్లి, పెందుర్తి

పారదర్శకంగా ఎన్నికలు

ఈ నెల 14న జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పెందుర్తి మండల పరిధిలో 13 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నాం. మా పరిధిలో పూర్తి పారదర్శకంగా ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా ఎన్నికలు జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. భవిష్యత్తులో ఆయా కమిటీల ప్రతిపాదనల మేరకు, ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి చెరువుల అభివృద్ధికి కృషి చేస్తాం.

– ఆర్.విజయ్‌కుమార్, ఏఈ, నీటిపారుదల శాఖ

ప్రశాంత ఎన్నికలకు ఏర్పాట్లు



రెవెన్యూ, నీటిపారుదల శాఖ సంయుక్తంగా ఎన్నికల నిర్వహణ చేపడుతున్నాం. ఇప్పటికే ఓటు వేసే రైతులకు కావాల్సిన ధ్రువపత్రాలు మంజూరు చేశాం. ఆయా కేంద్రాల్లో ఎన్నికల ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. బుధవారం నోటిఫికేషన్ ఇస్తాం. 14న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఆనంద్‌కుమార్, తహసీల్దార్, పెందుర్తి

నేడు ఉమా, మహేశ్వరుల కల్యాణోత్సవం

సింహాచలం: అడవివరంలోని పాత గోశాల లేఅవుట్‌లో కొలువుదీరిన పాదాలమ్మ, బంగారమ్మ, బాలాత్రిపుర సుందరి ఆలయ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉమా మహేశ్వరి, మహేశ్వరుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి కల్యాణం ప్రారంభమవుతుందని, భక్తులంతా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

సమయ పాలన పాటించని మద్యం షాపులపై చర్యలు

- అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: నియోజకవర్గంలోని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మద్యం దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. నిర్ణీత సమయాలు పాటించకపోయినా, బెల్ట్ షాపులను ప్రోత్సహించిన, ఎమ్మార్పీకి మించి అమ్మకాలు జరిపే షాపులపై కేసులు నమోదు చేయాలన్నారు. మద్యం షాపుల వద్ద లూజు అమ్మకాలు జరిపితే, ఆ విషయాన్ని తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన, నిర్ణీత సమయానికి మించి అమ్మకాలు జరిపే మద్యం దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేయాలన్నారు.

ఫార్మా పరిశ్రమల ద్వారా విడుదలవుతున్న కాలుష్యకారకాలను అరికట్టేందుకు కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సమావేశంలో మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, కూటమి నాయకులు కన్నూరు వెంకటరమణ, మోటూరు సన్యాసినాయుడు, వర్రి పరదేశి నాయుడు, బొడ్డపు శ్రీనివాసరావు, బుగిడి రామగోవిందరావు, సీహెచ్ ముత్యాలు, సాలాపు శివ, పైల దినేష్, అధికారులు పాల్గొన్నారు.

వనితర సాధ్యులు



ఈ ఫొటోలు చూశాక.. నా రక్తంతో నడుపుతాను రిక్షాను.. నా రక్తమె నా రిక్షకు పెట్రోలు.. అనే ఆర్.నారాయణమూర్తి పాట గుర్తుకొస్తే తప్పేం లేదు. వీరి పేర్లు దేముడమ్మ, ఈశ్వరమ్మ. పెందుర్తి మండలం రాంపురం పంచాయతీ పారిశుధ్య కార్మికులు. రోజూ ఉదయాన్నే ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరిస్తారు. వాటిని తమ రిక్షాలో వేసుకుని సాధూమఠం వెనుక బాపూజీనగర్ సమీపంలోని డంపింగ్‌యార్డుకు తీసుకెళ్తారు. రానూపోను నాలుగు కిలోమీటర్ల దూరం. రిక్షాలను తొక్కుకుంటూ, ఎత్తు రోడ్లపై నెట్టుకుంటూ వెళ్లడమే వీరి దినచర్య. తమ కాళ్లు పనిచేస్తే తప్ప.. కుటుంబం గడవని పరిస్థితి. దీంతో అరకొర జీతాలు.. అవీ అప్పుడప్పుడూ ఇచ్చినా.. కష్టాన్ని పంటి బిగువున భరిస్తూ ముందుకెళ్తున్నారు.

- పెందుర్తి

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం

పరవాడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతాంగం సద్వినియోగం చేసుకుని, తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పిలుపునిచ్చారు. భర్నికం గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును ఆయన సోమవారం ప్రారంభించి, మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను రైతులు సదస్సు దృష్టికి తీసుకువస్తే నెల రోజుల వ్యవధిలో వాటిని పరిష్కారించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సదస్సుల్లో పాల్గొన్న రైతులు వివిధ రెవెన్యూ సమస్యలపై 58 అర్జీలను అధికారులకు అందించారు. రీ సర్వేకి సంబంధించి 42, ఇనాం భూమికి సంబంధించి 4, వివిధ సమస్యలపై 12 అర్జీలు వచ్చాయి. సదస్సులో తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, ఎంపీడీవో డి.ఎస్.శ్యామ్‌సుందర్, సర్పంచ్ పెదిశెట్టి పూజా శేఖర్, డీటీ సురేష్, వీఆర్వోలు, అధికారులు పాల్గొన్నారు.

సబ్బవరం: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కంచనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ అప్పారావు తెలిపారు. మండలంలోని అయ్యన్నపాలెం రెవెన్యూ సదస్సులో పాల్గొని, అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అయ్యన్నపాలెం రెవెన్యూ పరిధిలో 1,053 ఎకరాల భూమి ఉండగా వీటిలో 416.12 ఎకరాల జిరాయితీ, 637.84 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. సదస్సులో రైతుల నుంచి వివిధ భూ సమస్యలపై 10 అర్జీలు వచ్చాయన్నారు. వీటిలో 6 ఆన్‌లైన్ సబ్ డివిజన్ కోసం, 4 మ్యూటేషన్ అర్జీలన్నారు. గత రెవెన్యూ సదస్సులో 141 అర్జీలు రాగా వాటిలో 43 అర్జీలను పరిష్కరించామని, మిగిలిన అర్జీలను రోవర్ సాయంతో పరిష్కరించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుదిరెడ్ల శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ బుదిరెడ్ల కనకరాజు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, ఆర్ఐ వీరయ్య, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అన్నంరెడ్డి శంకర్, రెవెన్యూ సిబ్బంది ఎం.గోవిందరావు, రాంబాబు, కామరాజు, శ్యాంకుమార్, శకుంతల, పవన్ కుమార్, కె.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



అయ్యన్నపాలెం సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు తదితరులు

కిక్ బాక్సింగ్‌లో అభయ్ ప్రతిభ



అభయ్‌కుమార్‌ను అభినందిస్తున్న విస్తం కళాశాల ప్రిన్సిపాల్ శివకుమార్

పెందుర్తి: ఆంధ్ర యూనివర్సిటీ జిమ్నాజియంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఏపీ కిక్ బాక్సింగ్ పోటీల్లో పెందుర్తి మండలం పినగాడిలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి టి.అభయ్‌కుమార్ స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభయ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శివకుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.అనంద్‌కుమార్, హెచ్‌వోడీ జోసెఫ్ నోయల్, ఫిజికల్ డైరెక్టర్ బి.రమణారావు, సిబ్బంది అభినందించారు.

సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణానికి శ్రీకారం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు గొల్లలపాలెంలోని కళామందిరం వద్ద సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. గ్రామ పంచాయతీ నిధులతో చేపట్టనున్న ఈ పనులను సర్పంచ్ దెడ్డం ప్రసాదరావుతో కలిసి వార్డు మెంబర్ పల్లా వరలక్ష్మి కొబ్బరి కాయ కొట్టి శ్రీకారం చుట్టారు. సుమారు రూ.1.50 లక్షలతో దీన్ని నిర్మించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు పల్లా కృష్ణ, స్థానిక నాయకులు పల్లా అప్పలనాయుడు, పల్లా అప్పలరాజు, పల్లా రమణ తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న వార్డు మెంబర్ వరలక్ష్మి, తదితరులు

పీజీఆర్ఎస్‌కు 8 వినతులు

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)కు వివిధ సమస్యలపై 8 వినతులు అందాయి. 98వ వార్డు అడవివరంలో డ్రైనేజీ సమస్య కోసం, 95వ వార్డు వేపగుంట–పినగాడి రోడ్డు విస్తరణ, 96వ వార్డు దొగ్గవానిపాలెంలో స్థలం ఆక్రమణపై, 95వ వార్డు కృష్ణరాయపురంలోని సర్వే నెం.31/13లో 30 అడుగుల రోడ్డు ఆక్రమణ, 96వ వార్డు పెందుర్తి సర్వే నెం.261/1, 277లో 20 సెంట్ల ఆక్రమణ, 95వ వార్డు చీమలాపల్లిలో పందుల సంచారం, 89వ వార్డు నరవ రోడ్డు బాలాజీనగర్‌లో డ్రైనేజీలు, సీసీ రోడ్డు నిర్మాణం కోసం, 94వ వార్డు వేపగుంటలో తాగునీటి కుళాయి మరమ్మతుల కోసం జోనల్ కమిషనర్ హైమావతికి వినతులు సమర్పించారు. ఆయా ఫిర్యాదులను స్వీకరించి వాటిపై విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోవాలని ఏసీపీకి జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హైమావతి


ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ

డాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. అందుకు ప్రతి ఒక్కరూ తమ వాహనాలను ఒక రోజు విడిచి ప్రజా రవాణాను వినియోగించాలని కోరారు. ఆరిలోవ పెదగదిలిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం ఆమె ప్రజా రవాణా వ్యవస్థ ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు నగరవాసులు వారంలో ఒక రోజు తమ వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా కర్బన ఉద్గారాలను ఎంతో కొంత మేర తగ్గించుకోవచ్చన్నారు. జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు కూడా వారంలో ఓ రోజు ప్రజా రవాణా వాహనాలను ఉపయోగిస్తున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, నగర ప్రజలు ఇదే విధంగా తమకు సహకరించి ఆర్టీసీ బస్సులు, లేదా సైకిళ్లను ఉపయోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రివచ్చన్నారు.



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



పెందుర్తి: స్థానిక నాలుగు రోడ్ల కూడలి కొత్తవలస బస్టాప్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని ఓ వ్యక్తిని సోమవారం ఉదయం పెందుర్తి పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం అతడు మృతి చెందినట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. వివరాలు. కొత్తవలస బస్టాప్ షెల్టర్ వద్ద ఓ వ్యక్తి(45) అపస్మారక స్థితిలో ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతడ్ని 108లో కేజీహెచ్‌కు తరలించి, చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ వెల్లడించారు. వివరాల కోసం 94407 96039, 96767 97314 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.